# ప్రజల ఆశీర్వాదమే కొండంత బలం

- కర్ణాటకలో హామీలు నెరవేర్చిన తర్వాతే కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలి
- మామిళ్లపల్లి ఎన్నికల సభలో ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు

ఉప్పునుంతల, నవంబర్ 6: కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతనే తెలంగాణలో ఆ పార్టీ నాయకులు ఓట్లు అడగాలని ప్రభుత్వవిప్,ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్లపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆశీర్వాదం తీసుకున్న అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామస్తులు పూలవర్షం కురిపిస్తూ ఊరేగించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశ్వీరాదంతో ముచ్చటగా మూడోసారి విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలకు సేవ చేస్తున్నామని చెబుతూ ప్రజా ఆరోగ్యంతో దందా చేస్తూ రూ.కోట్లు దోచుకుంటున్నారన్నారు. ఉప్పునుంతల జెడ్పీటీసీ పదవిని అడ్డం పెట్టుకొని రైస్‌మిల్లుల్లో తూకంలో రైతులను దగా చేయడం, అదేవిధంగా అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తుండడంతో మందలించడం జరిగిందన్నారు. ఆయన అక్రమాలకు ఫుల్‌స్టాప్ పెట్టడంతో పార్టీ ఫిరాయించడం జరిగిందన్నారు. రాజకీయాల్లో ఉండి ప్రజాసేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులతో ఉప్పునుంతల మండలం సస్యశ్యామలమైందన్నారు. ఉప్పునుంతలలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా 30 పడకల దవాఖానను నిర్మించి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి అచ్చంపేట గడ్డను.. గులాబీ పార్టీకి అడ్డాగా మార్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవిందర్‌రావ్, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ కల్పన పరమేశ్, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, నాయకులు శంకర్, రామస్వామిగౌడ్, దామోదర్, ఖాజా గ్రామస్తులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లిలో ఎమ్మెల్యే గువ్వలకు కోలాటంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

## అభివృద్ధికిఆ కర్షితులైబీఆ ర్ఎస్‌లోకి..

- అచ్చంపేటలో 20మంది కాంగ్రెస్ మైనార్టీ నాయకులు చేరిక
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, నవంబర్ 6: అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం అచ్చంపేట టీచర్స్‌కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 20మంది మైనార్టీలు విప్ గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, మన ప్రభుత్వంలో అమలు పరిచిన పథకాలే వారిని ఆకట్టుకుంటున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అమలు పరిచిన సంక్షేమ పథకాలు బీద, బడుగు బలహీన వర్గాలకు, నిరుపేదలకు చేరువయ్యాయన్నారు. అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌కు ఓటువేసి ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు అత్యధిక మెజార్టీతో విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గువ్వల బాలరాజు గెలుపే లక్ష్యం



సిరుసనగండ్లలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత యాతంశ్రీనివాస్

చారకొండ, నవంబర్ 6 : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గెలుపే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా నేత యాతంశ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని సిరుసనగండ్లలో విప్ గువ్వల బాలరాజుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పశుల శ్రీను, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కొండనాగులలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ అరుణ

బల్మూర్, నవంబర్ 6: అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు గెలుపు ఖాయమని ఎంపీపీ అరుణ నరసింహారావు అన్నారు. సోమవారం మండలంలోని కొండనాగుల, బల్మూర్, అనంతవరం, గట్టుతుమ్మెన్, మహదేవ్‌పూర్ తదితర గ్రామాల్లో గువ్వల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వలతోనే అన్నివిధాలా అభివృద్ధి జరిగిందన్నారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శివశంకర్, రేవతి, తిరుపతి రావు, నాగరాజు, ఎంపీటీసీలు ఆంజనేయులు, నారాయణ, ఉపసర్పంచులు యూసుఫ్, తిరుపతయ్య, రాజు, గంగయ్య, వెంకటమ్మ, నాయకులు సుదర్శన్ రావు, రాజశేఖర్ రావు, నాగయ్య, రాములు, బక్కయ్య, ప్రేమ్‌రావు, రాజేందర్ గౌడ్, తిరుపతయ్య, చంద్రమోహన్, రామస్వామి గౌడ్ పాల్గొన్నారు.

## గులాబీ జెండా ఎగరడమే లక్ష్యం



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అచ్చంపేట రూరల్, నవంబర్ 6: మనమంతా ఒక్కటై గులాజీ జెండాను నల్లమలలో మూడోసారి ఎగరేద్దామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని పల్కపల్లి శివారులో పొలాల్లో సోమవారం బీఆర్ ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమై శాసన సభ ఎన్నికల్లో బీఆర్ ఎస్ నియోజకవర్గ అభ్యర్థి గా మూడోసారి బరిలో నిలిచానని, ఆదరించాలని కోరారు. ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గ్రామంలో బీఆర్ఎస్ పరిస్థితిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ గౌడ్ ,బీఆర్ఎస్ సాయిరెడ్డి, ఏఆర్ రెడ్డి, జగదీశ్, దేవేందర్ పాల్గొన్నారు.

## ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం

అచ్చంపేట టౌన్, నవంబర్ 6: అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కపిలవాయి మహేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేండ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ గురుస్వాములు మండికారి బాలాజీ, కేతేపల్లి వెంకటేశ్, లక్ష్మణాచారి, బాదం రాజశేఖర్, నరేశ్, పిన్నంశెట్టి వెంకటేశ్ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి వలసవాది కాదా?

- రూ. వందల కోట్లతో నేడు అచ్చంపేట సస్యశ్యామలం
- విలేకరులతో మండల బీఆర్ఎస్ నేతలు

వంగూరు, నవంబర్ 6: అచ్చంపేటను సొంత గడ్డలా భావించి అభివృద్ధి చేసిన విప్ గువ్వలను వలసవాది అంటున్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో వలసవాది కాదా అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు గణేశ్‌రావ్, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ హామీద్ ప్రశ్నించారు. వంగూరులో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేవలం వలస కూలీ బిడ్డగా తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ అచ్చంపేటకు పంపిస్తే, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొని ఉద్యమాన్ని ఉవ్వెత్తున అన్ని వర్గాలకు విస్తరింపజేసి తెలంగాణను సాధించడంలో భాగమయ్యారన్నారు. అచ్చంపేట ప్రజలు ఈ వలస కూలీ బిడ్డను అక్కున చేర్చుకుని రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. అచ్చంపేట ప్రజలు చూపిన ప్రేమను ఒదిగి పట్టుకుని 24 గంటలు పేద ప్రజల సేవలో నిమగ్నమై వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న వ్యక్తి విప్ గువ్వల బాలరాజు అన్నారు. అచ్చంపేట నిధులు ఏమైనా ఆయన స్వగ్రామం పొల్కెపాడ్‌కు మళ్లించాడా, అచ్చంపేట అభివృద్ధికి వినియోగించారా అని, సోయి ఉండి మాట్లాడాలన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో నియోజకవర్గ కేంద్రంతో పాటు అన్ని మండలాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి ఎమ్మెల్యే గువ్వల అన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో మీరు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అమ్రాబాద్ మండలానికి సాగునీరు తెచ్చే సోయి ఏమైందని ప్రశ్నించారు. ఉమామహేశ్వర ఎత్తిపోతల పేరుతో అమ్రాబాద్ మండలానికి సాగు, తాగు నీరు అందించే బృహత్తర పథకం మంజూరైన విషయం వాస్తవం కాదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మరోసారి ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ఆనంద్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.



వంగూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## మొదటి నామినేషన్ అందజేత

అచ్చంపేటటౌన్, నవంబర్ 6: అచ్చంపేట నియోజకవర్గం 82కు మొదటి నామినేషన్ అందిందని రిటర్నింగ్ అధికారి గోపిరామ్ తెలిపారు. బహుజన సమాజ్ పార్టీకి చెందిన ఎం.నాగార్జున్ నామినేషన్ పత్రాన్ని అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైల పురవీధుల్లో భక్తుల సందడి

శ్రీశైలం, నవంబర్ 6: శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు సోమవార ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వామిఅమ్మవార్లకు జరిపే నిత్య ఆర్జిత సేవలు యదాతథంగా కొనసాగిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉచిత దర్శనానికి మూడు గంటలు, శీఘ్ర, అతిశీఘ్ర, విరామ దర్శనాలకు గంట సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

***సహస్ర దీపార్చన – వెండి రథోత్సవము***

మల్లన్నకు అత్యంత ప్రీతికరమైన సోమవారం ప్రదోశకాలంలో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ దీపాలంకరణసేవ నిర్వహించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ప్రధాన ఆలయ ప్రాకారంలో కుడివైపున ఉన్న పురాతన దీపాలంకరణ మండపంలో స్వామి అమ్మవార్లను ఊయలలో వేంచేబు చేసి వేదపండితులు మహాసంకల్పాన్ని పఠించారు. వెయ్యి ఎనిమిది దీపాలను వెలిగించిన అర్చక వేదపండితులు దీపార్చన, పల్లకీసేవ కార్యక్రమాన్ని ఘనంగా చేశారు. అనంతరం ఆలయ దక్షిణమాడవీధిలోని కళారాదన వేదికపై మహబూబ్‌నగర్‌కి చెందిన ఉషాబేబి వారిచే కూచిపూడి నృత్యకార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

## నర్సరీలను సిద్ధం చేయాలి

చారకొండ, నవంబర్ 6: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న నర్సరీలను సిద్ధం చేయాలని ఎంపీడీవో జయసుధ సూచించారు. సోమవారం కమాల్‌పూర్, సారంబండతండాల్లో నర్సరీ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బ్యాగులో ఎర్రమట్టి నింపడం, విత్తనాలు నాటడం సకాలంలో చేయాలని చెప్పారు.